www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 20 జనవరి 2024
5
తూర్పుగోదావరి



టిడిపి బహిరంగ సభ ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి-నల్లజర్ల

ఈ నెల 27న గోపాలపురం నియోజకవర్గంలో నిర్వహించే టిడిపి రా కదలిరా బహిరంగ సభ ఏర్పాట్లపై శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. బహిరంగ సభ ఏర్పాట్లను, జన సమీకరణ వసతులు మొదలగు పలు అంశాలపై వారు చర్చించారు. ఈ కార్యక్రమంలో జోన్ 2 కో ఆర్డినేటర్ మందలపు రవి, రాజమండ్రి పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కెఎస్.జవహర్, రాజమహేంద్రవరం రూరల్ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చియ్య చౌదరి, మాజీ ఎంఎల్ఎలు బురుగుపూడి శేషారావు, నల్లమిల్లి రామకృష్ణ, నాయకులు మద్దిపాటి వెంకటరాజు, ఆదిరెడ్డి శ్రీనివాస్, గన్ని కృష్ణ, కంఠమని రామకృష్ణ, జొన్నలగడ్డ చౌదరి, బొడ్డు వెంకటరమణ చౌదరి పాల్గొన్నారు.

ఎంపీ అభ్యర్థులు కావలెను..!

- పార్లమెంటు బరిలో నిలిచేదెవరు
- వైసిపి, టిడిపి కూటమిలో ఉత్కంఠ

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం పార్లమెంట్ స్థానం బరిలో నిలిచేదెవరనే సందిగ్ధత నెలకొంది. అధికార వైసిపి అసెంబ్లీ సమన్వయకర్తల పేర్లను ప్రకటించిన విషయం విదితమే. పార్లమెంటు అభ్యర్థుల పేర్లు ఇంకా ప్రకటించాల్సి ఉంది. రెండు మూడు రోజుల్లో ప్రకటించే అవకాశాలున్నాయని సమాచారం. మరోవైపు టిడిపి, జనసేన కూటమిలో ఏ పార్టీకి ఎంపీ స్థానం కేటాయిస్తారో ఇప్పటికీ స్పష్టత లేదు. ఆ పార్టీకి సైతం స్థానికంగా బలమైన అభ్యర్థులు లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. సాంస్కృతిక రాజధానిగా పేరుగాంచిన రాజమహేంద్రవరం పార్లమెంటు నియోజకవర్గంలో వైవిధ్యమైన ఓటర్లు ఉన్నారు. ఈ ప్రాంతంలో తొలి ఎంపీగా కమ్యూనిస్టు పార్టీ తరుపున కానేటి మోహనరావు, సోషలిస్టు పార్టీ తరుపున నల్లారెడ్డి నాయుడు ప్రాతినిథ్యం వహించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ మూడుసార్లు, బిజెపి ఒకసారి, టిడిపి మూడుసార్లు ఈ స్థానాన్ని కైవశం చేసుకున్నాయి. జిల్లా కేంద్రమైన రాజమహేంద్రవరంతో పాటు మరో ఆరు నియోజకవర్గాల్లో ఈ పార్లమెంట్ స్థానం ఉంది. ఈ నేపథ్యంలో ఆర్థికంగా, సామాజికంగా బలాబలాలను పరిశీలించి అభ్యర్థులను బరిలో నింపేందుకు వైసిపి, టిడిపిలు కసరత్తు చేస్తున్నాయి. 2019లో పార్లమెంటు స్థానంలో గెలుపొందిన మార్గాని భరత్‌రామ్ రానున్న ఎన్నికల్లో రాజమహేంద్రవరం సిటీ ఎంఎల్ఏగా బరిలో నిలువనున్నారు. 2014లో టిడిపి నుంచి ఎంపీగా గెలుపొందిన మాగంటి మురళీమోహన్ దాదాపుగా క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉన్నారు. దీంతో ఈ రెండు పార్టీల్లో ఎంపీ అభ్యర్థి ఎవరనే ఉత్కంఠ కొనసాగుతోంది. మరోవైపు టిడిపి, జనసేన పొత్తులో భాగంగా స్థానాలు ఇంకా ఖరారు కాలేదు. మరోవైపు బిజెపి నుంచి ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి రాజమహేంద్రవరం పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేస్తారనే ప్రచారం జరుగుతోంది. తాజాగా ఆ పార్టీ నేత సోము వీర్రాజు తాను ఎంపీ లేదా అసెంబ్లీ స్థానానికి రాజమహేంద్రవరం నుంచే పోటీలో ఉంటానని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఆ పార్టీలోనూ గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఇప్పటికీ బిజెపితో అలయన్స్‌లో ఉన్న విషయం విదితమే. బిజెపి నాయకులు సైతం పలుమార్లు ఈ విషయాన్ని స్పష్టం చేశారు. అయితే ఈ స్థానం ఆ మూడుపార్టీలో ఎవరికి సొంతం అవుతుందో వేచి చూడాలి. వైసిపి తరుపున పార్లమెంటు అభ్యర్థిగా సినీ దర్శకులు వివి.వినాయక్ పోటీ చేస్తారనే ప్రచారం తాజాగా ఊపందుకుంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. కొన్ని రోజులుగా వైసిపి నగర అధ్యక్షుడు, ప్రముఖ వైద్యులు డాక్టర్ గూడూరు శ్రీనివాస్, లేదా మాజీ కార్పొరేటర్ డాక్టర్ అనసూరి పద్మలత పోటీ చేస్తారని ప్రచారం జరిగింది. ఈ ప్రచారానికి తెరదింపుతూ అధినేత నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. సినీ దర్శకులు వివి వినాయక్ జిల్లాలోని చాగల్లు మండలానికి చెందిన వారు కావడంతో పాటు స్థానికులతో అనుబంధం ఉంది. మరోవైపు సినీ చరిష్మా కలిసి వస్తాయనే ఆశాభావం ఆ పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతోంది. ఒక వైపు మాజీ కార్పొరేటర్ అనసూరి పద్మలత కూడా టికెట్ ఆశిస్తున్నారు.

టిడిపి, జనసేన కూటమిలో టిడిపికి కేటాయిస్తే మాజీ ఎంఎల్‌సి కుమారుడు బొడ్డు వెంకటరమణ చౌదరి ఎంపీగా పోటీ చేస్తారనే ప్రచారం జరిగింది. టిడిపి నుంచి రూరల్ ఎంఎల్ఎ బుచ్చయ్య చౌదరి కూడా రేసులో ఉన్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో అభ్యర్థుల ఎంపికపై పార్టీల్లోనూ ఆయా కేడర్లలోనూ ఉత్కంఠ నెలకొంది.



కులగణన సర్వే ప్రక్రియ పరిశీలన

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

స్థానిక 10వ వార్డులో కులగణన నమోదు ప్రక్రియను కలెక్టర్ శుక్రవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత క్షేత్ర స్థాయిలో కులగణన చేపడుతున్న సిబ్బంది పనితీరును పరిశీలించారు. డేటా ఎంట్రీ సమయంలో తీసుకుంటున్న చర్యలు పై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ, జిల్లాలో జనవరి 19 నుంచి 28 వరకు 10 రోజుల పాటు కులగణన సర్వే క్షేత్ర స్థాయిలో పూర్తి చెయ్యాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. జిల్లావ్యాప్తంగా 512 సచివాలయాల్లో 8,960 క్లస్టర్లలో 6,04,059 కుటుంబాల కులగణన చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ సర్వే ప్రక్రియలో గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది 8,781 మంది ఇంటింటి సందర్శన చేసి కులగణన పూర్తి చేస్తారని తెలిపారు. జనవరి 19 నుంచి 28 వరకు ఇంటింటి సర్వే పూర్తి చేసి, జనవరి 29 నుంచి ఫిబ్రవరి 2 వరకు 5 రోజుల పాటు ఆయా సచివాలయాల్లో నమోదు చేసిన డేటా అందుబాటులో ఉంచుతామని చెప్పారు. ప్రజలు నేరుగా వెళ్లి అందుబాటులో ఉన్న డేటా వివరాలు తెలుసుకునే సౌలభ్యం కల్పించనున్నట్లు మాధవీలత పేర్కొన్నారు. డేటా ధ్రువీకరణ, డేటా ఖరారు చేసే నిర్ధారణ ప్రక్రియ ఫిబ్రవరి 15 వరకు నిర్వహిస్తారన్నారు. బయోమెట్రిక్ ఆధారిత నిర్ధారణ చేపట్టి ఎటువంటి లోపాలు లేకుండా సమర్ధవంతంగా కులగణన పూర్తి చేయాలన్నారు. క్షేత్రస్థాయి సిబ్బందికి ఎదురయ్యే సమస్యలు, సందేహాలు తీర్చేలా ఎంపిడిఓలు సర్వేపై పూర్తి అవగాహనతో ఉండాలన్నారు. మండల స్థాయి, మున్సిపల్ స్థాయి అధికారులంతా వారికి కేటాయించిన గ్రామాలు, వార్డులను ప్రతి రోజు సందర్శించాలని, సూపర్వైజర్లు కూడా ప్రతి రోజు ఫీల్డ్‌లో ఉండాలని ఆదేశించారు.


సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్

ఉద్యోగుల బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ఉద్యోగ ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం బాకీ ఉన్న రూ.18 వేల 96 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని, పలు డిమాండ్లు నెరవేర్చాలని యుటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. కంబాల చెరువు సెంటర్ వద్ద శుక్రవారం చెవిలో పువ్వులు పెట్టుకుని, నోటికి నల్లని రిబ్బన్లు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణ కుమారి మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. రూ.20 వేల కోట్లు ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులకు బకాయి పడిందన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ ఇటువంటి పరిస్థితి లేదన్నారు. 30 శాతం ఐఆర్ ప్రకటించాలని, 1వ తారీఖున జీతాలు చెల్లించాలని పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని, ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి విడనాడాలని డిమాండ్ చేశారు. అనంతరం కంబాల చెరువు సెంటర్ నుంచి గోకవరం బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. గోకవరం బస్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. యుటిఎఫ్ నాయకులు పి.జయకర్, ఎ.షరీఫ్ మాట్లాడారు. ఈ నెల 24న జిల్లా స్థాయి నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తామని, 31 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు జిల్లాలో నిరాహార దీక్షలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి ఇవిఎస్ఆర్.ప్రసాద్, రూపస్ రావు, రమేష్ బాబు, రవిబాబు, దయానిధి, ఐ.రాజేశ్వరి, ఫణి కుమార్ పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

21 సెంచరీ సంస్థతో నన్నయ ఎంఒయు

ప్రజాశక్తి-రాజానగరం

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ విద్యార్థులకు గ్రూప్-2 పోటీ పరీక్షలకు శిక్షణ అందించేందుకు 21 సెంచరీ ఎడ్యుకేషనల్ సొసైటీ మధ్య అవగాహన ఒప్పందం పునరుద్ధరించామని విసి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. శుక్రవారం యూనివర్సిటీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఎంఒయుకార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విసి ఆచార్య కె.పద్మరాజు అధ్యక్షతన యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, 21 సెంచరీ ఎడ్యుకేషనల్ సొసైటీ ఛైర్మన్ పివివి.కృష్ణప్రదీప్ ఎంఒయు పత్రాలపై సంతకాలు చేసి పత్రాలు మార్చుకున్నారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో చదువుతున్న విద్యార్థులకు, పూర్వ విద్యార్థులకు గ్రూప్-2 పోటీ పరీక్షలకు సంబంధించి శిక్షణ అందించేందుకు 21 సెంచరీ ఎడ్యుకేషనల్ సొసైటీ ముందుకు వచ్చిందని తెలిపరాఉ. అర్హత, ఆసక్తి గల విద్యార్థులు ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ టి.హైమావతిని సంప్రదించాలని తెలిపారు.


ఎంఒయు కుదుర్చుకుంటున్న నన్నయ వర్శిటీ, సంస్థ ప్రతినిధులు

అంబేద్కర్ విగ్రహావిష్కరణకు తరలిన శ్రేణులు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

విజయవాడలో అంబేద్కర్ విగ్రహావిష్కరణకు తరలిన పార్టీ శ్రేణుల బస్సులను ఎంపీ మార్గాని భరత్ రామ్, రుడా ఛైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు శుక్రవారం జెండా ఊపి ప్రారంభించారు. తొలుత నగరంలోని గోకవరం బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూల దండలు వేసి ఎంపీ భరత్, రుడా ఛైర్మన్ రౌతు ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం ఎంపీ భరత్ మాట్లాడుతూ ప్రపంచ మేధావి, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ఆశయ సాధన దిశగా సిఎం జగన్ సంక్షేమ పాలన అందిస్తున్నారని చెప్పారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా అంబేద్కర్ 206 అడుగుల కాంస్య విగ్రహాన్ని విజయవాడలో ఏర్పాటు చేయడం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే గర్వకారణం అన్నారు. జగనన్న ప్రభుత్వంలో సామాజిక సాధికారత ఒక నినాదం కాదని, అది రాష్ట్ర ప్రభుత్వ విధానం అన్నారు. ఈ రోజు దేశం యావత్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వైపు చూసేలా పాలన ఉందన్నారు. కుల వివక్ష పోవాలని, సమ సమాజ స్థాపన రావాలన్నదే సిఎం జగనన్న ఆకాంక్ష అన్నారు. అందుకు అనుగుణంగానే పాలన అందిస్తున్నారని చెప్పారు. విద్య అనే పదునైన ఆయుధంతో సాంఘిక అసమానతలను పునాదులతో సహా పెకలించవచ్చని, అందుకే సిఎం జగన్మోహన్ రెడ్డి విద్యా రంగానికి అగ్ర తాంబూలం ఇస్తూ విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చారని చెప్పారు. విజయవాడ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహ స్ఫూర్తితో రాజమండ్రి క్వారీ సెంటర్‌లో పార్లమెంటు భవన నమూనాతో అద్భుతమైన కట్టడాన్ని, ఆ భవనంపై డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహాన్నినెలకొల్పుతున్నట్టు ఎంపీ భరత్ తెలిపారు. ఫిబ్రవరి మొదటి వారంలో ఆవిష్కృతం చేయనున్నామని చెప్పారు.



జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న ఎంపీ భరత్, రౌతు

పార్టీ శ్రేణులతో మంత్రి వేణు ప్రయాణం

కడియం విజయవాడలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహాఆవిష్కరణ, సామాజిక సమతా సంకల్ప సభకు కడియం మండలం నుంచి అధిక సంఖ్యలో వైసిపి శ్రేణులు బయలుదేరి వెళ్లారు. రాష్ట్ర మంత్రి, వైసిపి రాజమహేంద్రవరం రూరల్ కో ఆర్డినేటర్ చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు వై.స్టాలిన్ జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు. సుమారు 10 ప్రైవేట్ స్కూల్ బస్సుల్లో వైసిపి నాయకులు శ్రేణులు యువకులు బయలుదేరారు.


కార్యకర్తలతో బస్సులో ప్రయాణిస్తున్న మంత్రి వేణు



వైద్య పరీక్షలు చేస్తున్న అధికారులు

మురమండలో జగనన్న ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి-కడియం

కడియం మండలం మురమండ గ్రామంలో స్థానిక చెరుకూరి రుక్మిణి సత్యం కళ్యాణ మండపంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం డాక్టర్ జి.స్వరూప ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 430 మంది పేషెంట్లకు అవసరమైన పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. 54 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్యశ్రీకి ముగ్గురిని రిఫరల్ చేశారు. ఈ శిబిరంలో గైనకాలజిస్ట్ డాక్టర్ ఎల్.మోహన్ వంశీ, జనరల్ మెడిసిన్ జి.రత్నమాధురి, ఆస్తమాలజిస్ట్ వి.గౌతమ్ మరియు సిబ్బంది వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అయినవిల్లి రుక్మిణీ, పంచాయతీ కార్యదర్శి భీమాల సరోజారాణి, డిసిఎంఎస్ డైరెక్టర్ అయినవిల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆకాశవాణి ఎఫ్ఎం కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్


ఆకాశవాణి రాజమహేంద్రవరం ఎఫ్ఎం కేంద్రాన్ని శుక్రవారం ప్రధాని నరేంద్ర మోడీ వర్చువల్‌గా చెన్నై నుంచి ప్రారంభించారని రాజమహేంద్రవరం ఎఫ్ఎం రిలే కేంద్ర ఇన్‌ఛార్జి జి.వేణు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో పాటు మరో 11 ఆకాశవాణి ఎఫ్ఎం ట్రాన్స్‌మీటర్లు, నాలుగు దూరదర్శన్ కేంద్రాలను ప్రధాని మంత్రి ప్రారంభించారని తెలిపారు. లాలాచెరువు వద్ద జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న రాజమహేంద్రవరం ఎఫ్ఎం రిలే కేంద్రంలో డెప్యూటీ డైరెక్టర్ జనరల్ సుబ్బా రావు ప్రత్యక్షంగా రిలే కేంద్ర ట్రాన్స్ మీటర్‌ను ప్రారంభించారు. 102.9 మెగాహెర్జ్ రాజమహేంద్రవరం ఎఫ్ఎం కేంద్రం ద్వారా ఆకాశవాణి విశాఖపట్నం కేంద్ర అన్ని కార్యక్రమాలూ స్థానిక ప్రజలకు అందుబాటులోకి వస్తాయన్నారు. ఈ ట్రాన్స్ మీటర్ ఏర్పాటు వల్ల ఆకాశవాణి కార్యక్రమాలు ఇటు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో, అటు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో స్పష్టంగా వినపడతాయని ఆకాశవాణి విశాఖపట్నం కేంద్ర డెప్యూటీ డైరెక్టర్ జనరల్ సి.సుబ్బారావు అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆకాశవాణి విశాఖపట్నం కేంద్ర కార్యక్రమాల అధిపతి సూర్య ప్రకాశరావు మాట్లాడుతూ ఇక మీదట రాజమహేంద్రవరం ఎఫ్ఎంలో, కాకినాడ ఎఫ్ఎంలో ఆకాశవాణి, విశాఖపట్నం కేంద్ర కార్యక్రమాలు శ్రోతలు వినవచ్చని చెప్పారు.

నిరాటంకంగా కుల గణన

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం రూరల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన కార్యక్రమం ధవళేశ్వరంలోని గ్రామ సచివాలయం సిబ్బంది వాలంటీర్లతో నిరాటంకంగా రాత్రి 9 గంటల వరకు కొనసాగుతోంది. ప్రతి ఇంటికీ వెళ్లి వారి వివరాలను వాలంటీర్లు సచివాలయం సిబ్బంది అడిగి సమాచారాన్ని సేకరిస్తున్నారు. ధవళేశ్వరం సచివాలయం-1 ఫిషరీస్ అసిస్టెంట్ ఎ.సంధ్య, వాలంటీర్లు ప్రసన్న, సాయి వెంకటేష్, భారతి పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-దేవరపల్లి

రహదారి ప్రయాణంలో నిబంధనల పట్ల అవగాహన పెంచుకుని ప్రాణ నష్టం వాటిల్లకుండా మెలగాలని నేషనల్ హైవేఅథారిటీ ఆఫ్ ఇండియా ప్రాజెక్ట్ డైరెక్టర్ సురేంద్రనాథ్ అన్నారు. శుక్రవారం జాతీయ రహదారిలో ప్రయాణించే వాహనదారులకు పాదచారులకు జనవరి 15 నుంచి నెల రోజులపాటు రోడ్డు ప్రమాదాల నివారణకు ఎన్‌హెచ్‌ఐఎ, జిఆర్ ఇన్ఫ్రా సంయుక్తంగా శుక్రవారం అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా జాతీయ రహదారి 16 గుండుగొలను, దేవరపల్లి, కొవ్వూరు హైవేపై వాహనదారులకు అవగాహనా కార్యక్రమాన్ని పీడీ సురేంద్రనాథ్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రహదారులపై ప్రయాణించే వారికి సూచికలపై అవగాహన కలిగి ఉండాలని, హెల్మెట్, సీట్ బెల్ట్, రేడియంట్‌పై ఆవశ్యకత తదితర అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హైవే అధికారులు పావని, సాయినాథ్, అధికారులు రాహుల్, రామ్ అఖిల్ పాల్గొన్నారు.

39వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె

39వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె

తమ డిమాండ్లు నెరవేర్చాలని అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె శుక్రవారం 39వ రోజుకు చేరింది. పలుచోట్ల 24 గంటల రిలే నిరాహార దీక్ష ప్రారంభించారు. పలు ప్రజా సంఘాల నాయకులు వారికి మద్దతు తెలిపారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి గోకవరం బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.సుందర బాబు, బి.రాజులోవ, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సిహెచ్.మాణిక్యాంబ, కె.బేబిరాణి మాట్లాడారు. విజయవాడలో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి రాజ్యాంగం ప్రకారం అంగన్‌వాడీలకు కనీస వేతనాలు ఎందుకు అమలు చేయరని వారు ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షల మంది అంగన్వాడీలు 39 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదని విమర్శించారు. ఎన్నికల ముందు ఓట్లు కోసం ఎన్నో హామీలు ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికలు అయిపోయాక సమస్యలు వినే తీరికి కూడా లేకపోవడం శోచనీయం అన్నారు. ఇప్పటికైనా అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే ఉద్యమం మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అంగన్‌వాడీల 24 గంటల దీక్షకు యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.అరుణ కుమారి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.జయకర్, ఎ.షరీఫ్, కోశాధికారి ఇవిఎస్ఆర్.ప్రసాద్, జిల్లా కార్యదర్శులు ఎన్.రవిబాబు, రమేష్‌బాబు, దయానిధి, ఎఐటియుసి సీనియర్ నాయకులు నల్లా రామారావు, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు కె.జోజి, కాంగ్రెస్ పార్టీ రాజమండ్రి నగర అధ్యక్షులు బాలేపల్లి మురళీధర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముళ్ల మాధవ్, టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యనిర్వాహక తీడా ఆదిబాబు, నాయకులు నీలి కిషోర్ మద్దతు తెలిపారు.

దేవరపల్లి తహశీల్దార్ కార్యాలయం వద్ద శిబిరంలో ఒంటి కాలిపైన నిలబడి అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. టిపి.లక్ష్మి మాట్లాడారు. సమ్మెకు యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు హుస్సే శంకరుడు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎ.పద్మ, కామేశ్వరి, కె.కుమారి, కె.వరలక్ష్మి, ఎస్‌కె.గౌస్య, కె.మంజు పాల్గొన్నారు.

చాగల్లు తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరవధిక సమ్మె శిబిరంలో యూనియన్ నాయకులు పి.విజయ కుమారి, కె.లక్ష్మి మాట్లాడారు. అధిక సంఖ్యలో అంగన్వాడీలు పాల్గొన్నారు

కడియం అంగన్వాడీల నిరవధిక సమ్మెకు రాజమహేంద్రవరం రూరల్ కాంగ్రెస్ నాయకులు జెటి.రామారావు సంఘీభావం తెలిపారు. సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించారు.



రాజమహేంద్రవరంలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న వర్కర్లు


చాగల్లులో..


దేవరపల్లిలో..

43వ వార్డులో 'భవిష్యత్తుకు బాబు గ్యారెంటీ'

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

అభివృద్ధికి చిరునామాగా ఉన్న ఎపి జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత నాశనం చేశారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ ధ్వజమెత్తారు. టిడిపి, జనసేన పార్టీ కూటమి నేతత్వంలో స్థానిక 43వ డివిజన్‌లో మాజీ కార్పొరేటర్ కంటిపూడి పద్మావతి, టిడిపి నగర కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి కంటిపూడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ మ్యానిఫెస్టోతో పాటు జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అవలంబించిన ప్రజా వ్యతిరేక విధానాలపై ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ 'నేను ఉన్నాను, నేను విన్నాను' అని చెప్పి ఎన్నికల్లో గెలిచిన తర్వాత అన్ని వర్గాల ప్రజలను సిఎం మోసం చేశారన్నారు. నాలుగున్నరేళ్లుగా ఎపి ప్రజలతో సీఎం జగన్ ఆటలు ఆడుకుంటున్నారని, ఆశా వర్కర్స్, మున్సిపాలిటీ, అంగన్వాడీ ఉద్యోగులు.. ఇలా అందరితో ముఖ్యమంత్రి అడుకుంటున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వ ఉద్యోగులకు సమయానికి జీతాలు ఇవ్వకుండా.. మధ్యతరగతి ప్రజల జీవితాలతో ఆడుకున్నారని అన్నారు. జగన్ పాలనలో వ్యవసాయ రంగం అన్ని విధాలా నిర్వీర్యమైందని విమర్శించారు. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి టిడిపితోనే సాధ్యమని ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. అనువశీలురైన టిడిపి అధినేత చంద్రబాబు విజన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు విజ్ఞతతో ఓటు హక్కు వినియోగించుకుని వైసిపికి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.


రామోజీ రాతలపై ఎంపీ భరత్ ఆగ్రహం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

వాస్తవాలను ప్రతిబింబించకుండా ఇష్టం వచ్చినట్టు రాసి వాటినే వార్తలన్నట్టు ప్రజలను నమ్మించే ప్రయత్నం చేయడం ఈనాడు రామోజీరావుకు అలవాటేనని ఎంపీ మార్గాని భరత్‌రామ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు నాయుడు దళితులను అపహాస్యం చేసినప్పుడు రామోజీరావు కలంలో సిరా ఇంకిపోయిందా, ఆ మాటలు రామోజీ చెవికి తాకలేదా అని ఆయన ప్రశ్నించారు. దళితునిగా పుట్టాలని ఎవరైనా అనుకుంటారా అని చంద్రబాబు కండ కావరంతో కుల వివక్షను ప్రేరేపించే విధంగా వ్యాఖ్యానించినప్పుడు ఈనాడులో రామోజీరావు ఎందుకు రాయలేకపోయారని ఎంపీ భరత్ ప్రశ్నించారు. సమ సమాజ స్థాపనలో భాగంగా దేశంలో ఏ నాయకుడూ చేయలేనిది సిఎం జగన్ చేస్తున్నారని స్వాగతించడం పోయి తప్పుడు రాతలతో ప్రజలకు మీరిచ్చే సందేశం ఏమిటని ప్రశ్నించారు. విజయవాడ స్వరాజ్ మైదాన్‌లో దేశంలోనే అతి భారీ విగ్రహాన్ని సిఎం జగన్మోహన్ రెడ్డి ఆవిష్కరించడం చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించే సమయమని అన్నారు.

నేరాలు ఘోరాలు

సిసి కెమెరాల స్తంభాన్ని ఢీకొట్టిన ట్రైలర్ వాహనం



నేలకొరిగిన సిసి కెమెరాల స్తంభం

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

సామర్లకోట - కాకినాడ రోడ్డులోని అచ్చంపేట రైల్వే ఓవర్ బ్రిడ్జి సెంటర్‌లో సిసి కెమెరాల స్తంభాన్ని ఒక ప్రైవేట్ సంస్థకు చెందిన ట్రైలర్ వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆ స్తంభానికి ఉన్న సిసి కెమెరాలు ధ్వంసమయ్యాయి. శుక్రవారం తెల్లవారు జామున పెద్దాపురం వైపు నుంచి కాకినాడ వైపు వెళుతున్న లారీ ట్రైలర్ వాహనం డ్రైవర్ నిద్ర మత్తులో సిసి కెమెరాల యూనిట్‌ను ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో డ్రైవర్ కేబిన్ నుంచి కింద పడిపోగా అతని చేతికి గాయమైంది. అతనిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు.

రెస్టారెంట్లపై విజిలెన్స్ దాడులు



తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

నిబంధనలకు విరుద్ధంగా ఆహార పదార్థాలు విక్రయించే రెస్టారెంట్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామనిరీజనల్ విజిలెన్స్ ఇన్‌ఛార్జి ఎస్‌పి ఎ.సురేష్ బాబు హెచ్చరించారు. గురువారం రాజానగరం మండలంలోని పలు రెస్టారెంట్లు, ఫుడ్ సెంటర్లపై విజిలెన్స్ అధికారులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు, లీగల్ మెట్రాలజీ అధికారులతో కలిసి ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ జగన్నాథపురం గ్రామంలోని ఫుడ్ పిరమిడ్‌ను తనిఖీ చేసి కేసును నమోదు చేశామన్నారు. దీనిపై జాయింట్ కలెక్టర్ కోర్టులో విచారణ జరుగుతుందని తెలపారు. ఈ తనిఖీల్లో డిఎస్‌పి ముత్యాలు నాయుడు, శ్రీనివాసరెడ్డి, నాగ వెంకట రాజు, లక్ష్మీనారాయణ, వ్యవసాయ అధికారి భార్గవ మహేష్, షబ్బీర్, జగన్నాథరెడ్డి, జీవానందం పాల్గొన్నారు.

20 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి - పెద్దాపురం

ఎస్ఇబి స్టేషన్ పరిధిలో శుక్రవారం నిర్వహించిన దాడుల్లో 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఇబి ఇన్‌స్పెక్టర్ కెవి.స్వామి తెలిపారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. ఈ దాడుల్లో భాగంగా పెద్దాపురం స్టేషన్ పరిధిలో తప్పించుకు తిరుగుతున్న ముగ్గురిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచామన్నారు. ఈ దాడుల్లో ఎస్ఇబి ఎస్ఐ వై.నాగేంద్ర కృష్ణ పాల్గొన్నారు.

ఇద్దరి అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

మండలంలో ఇద్దరు వ్యక్తుల అదృశ్యంపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు శుక్రవారం ముమ్మిడివరం పోలీసులు తెలిపారు. మండలంలోని అన్నంపల్లి గ్రామానికి చెందిన లంక సాయమ్మ మతి స్థిమితం లేని వృద్ధురాలు గత బుధవారం రాత్రి నుంచి కనిపించక పోవడంతో కుమార్తె అయినవిల్లి దేవి ఫిర్యాదు మేరకు, అలాగే గేదెల్లంక గ్రామానికి చెందిన లొల్ల వీర వెంకట భావన రుషి(34) గురువారం నుంచి కనపడకపోవడంతో తండ్రి కృపావరం ఫిర్యాదు మేరకు స్టేషన్ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళ ప్రాణాలు కాపాడిన పోలీసులు

ప్రజాశక్తి-ధవళేశ్వరం

గోదావరిలోకి దూకి ఆత్మహత్యా యత్నానికి పాల్పడబోయిన మహిళను పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి కాపాడారు. కడియం మండలానికి చెందిన గోళ్ల ఆది లక్ష్మి కుటుంబ సమస్యలతో మనస్తాపం చెంది బ్యారేజ్ మీద నుంచి దూకి చనిపోదామని ధవళేశ్వరం బ్రిడ్జి వద్దకు వెళ్లింది. విషయం తెలుసుకున్న ఆమె బంధువులు 112కు కాల్ చేశారు. ఎస్‌పి పి.జగదీష్ ఆదేశాలతో ధవళేశ్వరం సిఐ కె.మంగాదేవి వెంటనే స్పందించి పోలీసులు సిబ్బందిని హుటాహుటిన పంపించారు. వారు ఆమెను గుర్తించి ఆత్మహత్యా ప్రయత్నాన్ని అడ్డుకుని పోలీస్ స్టేషన్‌కు తీసుకు వచ్చారు. బంధువులకు సమాచారం అందించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

అభివృద్ధిపై రౌతుకు అవగాహన లేమి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ఎంఎల్‌సిగా తను చేసిన అభివృద్ధి ఏమీ లేదని మాజీ ఎంఎల్ఎ, రుడా ఛైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు విమర్శించడం ఆయన అవగాహన లేమిని తెలియచేస్తోందని మాజీ ఎంఎల్‌సి, టిడిపి సీనియర్ నాయకుడు ఆదిరెడ్డి అప్పారావు అన్నారు. రాజమండ్రి ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆదిరెడ్డి మాట్లాడారు. అభివద్ధిపై మాట్లాడే అర్హత తమకే ఉందన్నారు. 2019 ఎన్నికల్లో తమ కోడలు భవానీమీద 32 వేల ఓట్ల తేడాతో రౌతు ఓడిపోయయారని, ఎంపీ భరత్‌కు కూడా రాజమండ్రి సిటీలో 28 వేల ఓట్లు తక్కువ వచ్చాయని గుర్తు చేశారు. రెండుసార్లు ఎంఎల్ఎగా, రెండుసార్లు టిటిడి బోర్డు సభ్యునిగా అవకాశం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి వెన్నుపోటు పొడిచి వైసిపిలో చేరిన రౌతు తనను వెన్నుపోటుదారుడు అని విమర్శించడం హాస్యాస్పదమన్నారు. తాను ఎంఎల్‌సిగా ఎందుకు బయటకు వచ్చాననే విషయం ఆరోజున జగన్‌కు, వైవి సుబ్బారెడ్డికి, పిల్లి సుభాష్ చంద్రబోస్‌కు తెలుసన్నారు. మొన్నటివరకు ఎంపీ మార్గాని భరత్ రామ్ వల్ల నీ రాజకీయ జీవితం నాశనమైందన్నావు, ఇప్పుడు భరత్‌ను డైనమిక్ లీడర్ అని ఎలా పొగుడుతున్నావని ఆదిరెడ్డి ప్రశ్నించారు. బిసి హాస్టల్లో రూ.5.60 కోట్లతో తాను అభివృద్ధి పనులు చేయించానని, 45, 46, 3, 4 వార్డుల్లో పేదలకు ఇళ్ల పట్టాలు ఇప్పించానన్నారు.

శ్రీనుకు బెయిల్ రాకుండా చేస్తున్నారు

టిడిపి నాయకుల ఆగ్రహం



రాజమహేంద్రవరంలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆయనపై దాడి కేసులో శ్రీనుకు బెయిల్ రాకుండా చేస్తున్నారని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్, చాపల చిన్నరాజు ఆరోపించారు. శ్రీనుకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ గోకవరం బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం కాశి నవీన్ కుమార్, చాపల చిన్న రాజు మాట్లాడారు. దళిత డాక్టర్ సుధాకర్ మాస్క్ అడిగితే పిచ్చి వాడిగా ముద్ర వేసి, ఆయన మృతికి కారణం అయ్యారన్నారు. వైసిపి ఎంఎల్‌సి అనంత బాబు తన డ్రైవర్ సుబ్రమణ్యాన్ని చంపి, డోర్ డెలివరీ చేశారన్నారు. జగన్ హయాంలో అన్ని రంగాలు ఘోరంగా విఫలం అయ్యాయని విమర్శించారు. జగన్‌కు అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే నైతిక హక్కు లేదన్నారు. అంబేద్కర్ స్మృతి వనాన్ని అసంపూర్తిగా పూర్తిచేసి.. ఎన్నికలు దగ్గర పడటంతో హడావిడిగా ప్రారంభించడం దారుణమన్నారు. 100 ఎకరాల్లో అంబేద్కర్ స్మృతివనం ఏర్పాటుకు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీకారం చుడితే దాన్ని ధ్వంసం చేసి మొక్కుబడిగా అంబేద్కర్ విగ్రహావిష్కరణ చేపడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మాజీ ఫ్లోర్ లీడర్ కోరుమిల్లి విజయశేఖర్, బొర్రా చిన్ని, రాయి అప్పన్న బాబు, కొమ్మర్తి బాబ్జి, కప్పల వెలుగు కుమారి, మామిడి శ్రీను, బూరా రమణ, రాచర్ల రమణ, ఉడమల నాగేశ్వరరావు, పోసుపో శేఖర్, ఉల్లంగి రాజు, శరత్ కుమార్, అలజంగి హేమంత్, రత్నం, నాయకులు కవులూరి వెంకటరావు, మోతా నాగలక్ష్మి, కనకం నాని నరేష్, బొల్లుపో సుధాకర్, ఆముదాల రవి, బొలుపో సురేష్ పాల్గొన్నారు.

రబీకి నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలి

జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో జిల్లా జెసి ఎస్.నుపూర్ అజయ్



సమావేశంలో మాట్లాడుతున్న జెసి ఎస్.నుపూర్ అజయ్

ప్రజాశక్తి-అమలాపురం

వ్యవసాయ, జలవనరులు, డ్రైనేజీ విభాగాలు సమన్వయంతో ప్రస్తుత రబీ సాగుకు నీటి ఎద్దడి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ నుపూర్ అజయ్ సూచించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్లోని సమావేశపు హాలులో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం జిల్లా జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా గత డిసెంబర్ మాసంలో మండలి సభ్యులు తీర్మానించిన అంశాలపై తీసుకొన్న చర్యలను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బోసు బాబు కమిటీ సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా పలువురు మండలి సభ్యులు మాట్లాడుతూ ప్రాధాన్యత క్రమంలో రైతుల సమస్యల పట్ల ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఈ సమస్యలపై అధికారులతో జిల్లా జాయింట్ కలెక్టర్ చర్చించారు. ఆయా సమస్యలు పరిష్కారానికై సంబంధిత అధికా రులకు దిశా నిర్దేశం చేశారు. ప్రతిపాదనలు ఏ దశలో ఉన్నది ఆమె అధికారులను అడిగి తెలుసుకుని సంబంధిత ఉన్నత స్థాయి అధికారులకు సమస్యలు నివేదించి త్వరగా అనుమతులు వచ్చే విధంగా ప్రయత్నం చేస్తానని ఆమె స్పష్టం చేశారు. ఉపాధి అనుసంధానంతో పంట కాలువలో పూడికలుతీతకు అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు అదేవిధంగా సాగునీటి వినియోగాన్ని గరిష్టతరం చేసే విధంగా షట్టర్ గేట్ల లీకేజీలను అరికట్టాలని ఆమె ఆదేశించారు. రబీ సాగుకు నీటి ఎద్దడి సమస్యలు ఉత్పన్నం కాకుండా డ్రైనేజీలలో క్రాస్ బండ్లు వేయడం వంటి పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టడంతో పాటు ఫిబ్రవరి 5 నుంచి వారాబంధి విధానంలో సాగునీరు విడుదల చేయాలని ఆమె ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 1, 02,701 విస్తీర్ణంలో రబీ సాగు చేపట్టడం జరిగిందన్నారు. మండలి సభ్యులు రమేష్ పలు రైతాంగ సమస్యలను వివిధ డ్రైనేజీల సమస్యలను అధికారులు దష్టికి తెచ్చారు. రాష్ట్ర అగ్రి మిషన్ సభ్యులు జిన్నూరు రామారావు మాట్లాడుతూ దాన్యం సేకరణ ప్రక్రియను ఖరీఫ్ సీజన్లో జెసి వారి స్వీయ పర్యవేక్షణలో చక్కటి సమన్వ యంతో పూర్తి చేయడం జరిగిందన్నారు. గత ఖరీఫ్ సీజన్లో ధాన్యం సేకరణలో పాల్గొన్న ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బందికి పెండింగ్ వేతనాలు జిల్లా పౌరసరఫరాలు జిల్లా సహకార శాఖ సమన్వయంతో చెల్లించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు మోటూరు సాయి, వ్యవసాయ శాఖ అధికారులు కాకి నాగేశ్వరరావు, వెంకట రామారావు,ఎల్ డి ఎం కే శ్యాంబాబు మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

యానాం వార్తలు

మాజీ స్పీకర్ కామిశెట్టికి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న ఆర్ఎఒ మునిస్వామి

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి మాజీ స్పీకర్ కామిశెట్టి పరశు రామ వం ప్రసాదరావు నాయుడు వర్ధంతిని సమాచార శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిప్మర్ ఆసుపత్రి సమీపంలో ఇందిరా గాంధీ పార్క్‌లో ఉన్న ఆయన విగ్రహానికి ఆర్ఎఒ మునిస్వామి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అదే విధంగా ది యానం తెలగా(కాపు) అభ్యుదయ సంఘ సభ్యులు నల్లా వెంకన్న, చెక్కల అరుణ్‌కుమార్, బండాబత్తుల ప్రసాద్, కామిశెట్టి కుటుంబ సభ్యులు, తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పి రఘునాయిగం, పిడబ్ల్యూడి ఎఇ నాగరాజు, ప్రసాద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

23న జాతీయ స్థాయి చిత్రలేఖన పోటీలు

ప్రజాశక్తి - యానాం

కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పరీక్షాపే చర్చ కార్యక్రమంలో భాగంగా ఈనెల 23న స్థానిక జవహర్ నవోదయ విద్యాలయంలో చిత్రలేఖన పోటీలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ టివిఎస్ ప్రకాశరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో యానంలో 9 నుంచి 12వ తరగతి చదువుకుంటున్న విద్యార్థులు ఐదుగురికి మించకుండా పాల్గొనవచ్చని తెలిపారు. విద్యార్థులలో సృజనాత్మక నైపుణ్యాలను పెంపొందించి పరీక్షలను ఇష్టంగా రాయాలని సంకల్పంతో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీకి అవసరమైన సామాగ్రిని ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. ఇందులో 'పరీక్షలను పండగలా జరుపుకుందాం', 'పరీక్షలకు ఆందోళనతో కాదు', 'యోధుల్లా వెళ్దాం', 'టెక్నాలజీతో చదువు మరింత సులభం', 'చంద్రయాన్' అనే నాలుగు అంశాల్లో ఏదైనా ఒక విషయ నేపథ్యంతో విద్యార్థులు సృజనాత్మక చిత్రలేఖన చేయవలసి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 9849778512 నెంబరును సంప్రదించాలని కోరారు.

విద్యార్థుల పాలిట శాపం జిఒ 77



సమావేశంలో మాట్లాడుతున్న జనసేన నాయకులు

ప్రజాశక్తి -దేవరపల్లి

రాష్ట్రంలో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే పేద, బలహీన వర్గాల విద్యార్థుల పాలిట జిఒ నంబర్ 77 శాపంగా మారిందని జనసేన పార్టీ గోపాలపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి దొడ్డిగర్ల సువర్ణ రాజు అన్నారు. శుక్రవారం దేవరపల్లిలో పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యూనివర్శిటీ క్యాంపస్‌లు, ప్రభుత్వ కాలేజీలకు మాత్రమే ఫీజు రీయింబర్స్‌మెంట్ వసూలు చేస్తుండటంతో వందలాది మంది ఉన్నత విద్యకు దూరం కావాల్సి వస్తోందన్నారు. జిఒ నెంబర్ 55తో ఎస్‌సి, ఎస్‌టి, బిసి విద్యార్థులు ఒక విభాగంలో వందమంది ఉంటే 70 మందికి మాత్రమే స్కాలర్‌షిప్ వచ్చేలా చేసి రాష్ట్ర ప్రభుత్వం అనేకమంది విద్యార్థులను చదువుకు దూరం చేసిందని విమర్శించారు. ఐదు మెడికల్ కాలేజీల్లో వెయ్యి సీట్లకు గాను 500 సీట్లకు స్కాలర్‌షిప్ మంజూరు చేసి మిగిలిన సీట్లను అంగట్లో అమ్ముకుని దళిత విద్యార్థులకు తీరని అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సబ్ ప్లాన్ నిధులను కూడా దారి మళ్ళించి తొంబై శాతం వేరే పనులకు ఖర్చు పెట్టిన ముఖ్యమంత్రిగా జగన్ కీర్తి గడించారని దుయ్యబట్టారు.

జొన్నాడలో ఘనంగా వేమన జయంతి



వేమన విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రెడ్డి సంఘం ప్రతినిధులు

ప్రజాశక్తి - ఆలమూరు

జొన్నాడ గ్రామంలో శుక్రవారం వేమన జయంతి వేడుకలను రెడ్డి సంఘం సభ్యులు నిర్వహించారు. ముందుగా యోగి వేమన విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేమన పద్యం ఒకటైనా రాని తెలుగువారు ఉండరని, తెలుగు జాతి ఉన్నంతకాలం వేమన పద్యాలు ప్రజల నాలుకలపై నిలిచే ఉంటాయన్నారు. వేమన తెలుగు సాహిత్యానికి ఒక కొండగుర్తుగా నిలుస్తారని అన్నారు. కార్యక్రమంలో వేమన రెడ్డి సంఘం నేతలు తాడి తమ్మిరెడ్డి, మేడపాటి రామారెడ్డి, తాడి శ్రీనివాస్ రెడ్డి, సత్తి శ్రీనివాస్ రెడ్డి, ద్వారంపూడి అప్పారెడ్డి, ద్వారంపూడి దొరబాబు, సర్పంచ్ కట్టా శ్రీనివాస్, ఉప సర్పంచ్ నాంద్ర నాగమోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విజయవాడకు తరలిన వైసిపి శ్రేణులు

తాళ్లరేవు : విజయవాడలో డాక్టర్ బిఆర్.అం బేద్కర్ విగ్రహ ప్రారంభోత్సవానికి ఎంపిపి రాయుడు సునీత ఆధ్వర్యంలో మండలం నుంచి వైసిపి శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలు



ఆలమూరులో గురువులతో పూర్వ విద్యార్థులు



రాజోలులో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి- యంత్రాంగం

జిల్లాలో పలుచోట్ల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. **ఆలమూరు** మండలంలోని మూలస్థానం జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో 2007-08 టెన్త్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. మిత్రుల్లో ఇన్నేళ్ల తర్వాత కుటుంబ సభ్యులతో వచ్చి ఆ'పాత' మధురాలను పంచుకున్నారు. తమను తాము పరిచయం చేసుకుంటూ తరగతి గదుల్లో చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. శాలువాలు, పూలదండలు, కానుకులతో తమ గురువులను సత్కరించారు. పూర్వ విద్యార్థుల కలయిక కేవలం సమావేశాలకే పరిమితం కాకుండా ప్రజాహిత కార్యక్రమాలకు ఒకరికొకరు సహకరించుకునే విధంగా చేయూత నివ్వాలని పూర్వ విద్యార్థులు అన్నారు. ఎవ్వరికీ ఎలాంటి అవసరం వచ్చినా అందరం కలిసి భాగస్వాములు కావాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో తోట సతీష్, కంచుమర్తి సురేష్, ముచ్చర్ల రాజు, గుండు బోగుల ప్రసాద్, దేవరపూడి నాగేశ్వరరావు, తోట సత్తిబాబు, పాల్గొన్నారు. **రాజోలు** మండలంలో శివకోటి జడ్‌పిఉన్నత పాఠశాల్లో1982-83 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం తెలగ కల్యాణమండపంలో నిర్వహించారు. ఆప్పటి టెన్త్ స్కూల్ టాపర్స్ మేడిచర్ల రామా రావు, మేడిచర్ల సత్యనారాయణలను, అప్పటి బ్యాచ్‌లో మొదటిగా ప్రభుత్వ ఉద్యోగం లో చేరిన బర్రె సత్యనారాయణ మరియు మాథ్స్ టీచర్ చిట్టావర్జుల సుబ్రహ్మణ్యం, సోషల్ టీచర్ అడ బాల జగన్నాథరావు, తెలుగు టీచర్ (అప్పటి రాష్ట్ర బెస్ట్ టీచర్ అవార్డ్ గ్రహీత) స్వర్గీయ కంపెళ్ళ సబ్బాయుడు కుమార్తె కంపెళ్ల బాలా త్రిపుర సుందరి లను సత్కరించారు.కమిటీ సభ్యులు బి.రాచయ్య, బాలాజీ వేమ, కేసరి సత్య, చెల్లబోయిన సూర్య చంద్ర రావు, అనిశెట్టి వరలక్ష్మి పాల్గొన్నారు. తమ తోటి పూర్వపు విద్యార్థుల పిల్లలైనా ఆర్థిక కారణాలతో చదివించే స్థాయి లేకపోతే, వారిని దత్తత తీసుకొని చదివించే బాధ్యత తీసుకున్నట్లు కమిటీ నిర్ణయం తీసుకుంది. **మండపేట** స్థానిక ప్రభుత్వ పాఠశాల్లో 1984-85లో టెన్త్ చదువు కున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కాపు కల్యాణ మండపంలో శుక్రవారం జరిగింది. వివిధ రంగాలలో వివిధ ప్రాంతాలలో స్థిరపడిన బాల్య మిత్రులందరూ ఉత్సాహంగా గడిపారు. భవిష్యత్తులో ప్రతి సంవత్సరం కలిసి సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహించాలని తీర్మానం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వాడ్రేవు శ్రీనివాస్, యేలేటి వెంకటేశ్వరరావు, కర్రి వెంకటరమణ, దూలం నాగు, మన్యం ప్రసాద్, శెట్టి నాగేశ్వర రావు,విజ్ఞాన్ గణేష్ పాల్గొన్నారు.



మండపేటలో పూర్వ విద్యార్థులు

రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ భేటీ



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లాలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఎస్ఆర్-2024 రూప కల్పనలో భాగంగా జిల్లాలో జరుగుతున్న వివిధ కార్యకలాపాలు, ఫారం 6, 7, 8 లకు పరిష్కారాలు, ఎన్నికల సంఘం మార్గదర్శ కాలను రాజకీయ పార్టీ ప్రతినిధులకు కలెక్టర్ వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కతికా శుక్లా మాట్లాడుతూ ఈ నెల 22న తుది ఓటర్ల జాబితా ప్రచురించడం జరుగుతుందన్నారు. ఈ ఓటర్ల జాబితాను అన్ని పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉంచడం జరుగుతుందని వివరించారు. జిల్లాలోని 1,637 పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన కనీస సౌకర్యాలైనా విద్యుత్, ఫర్నిచర్, తాగునీరు, మరుగుదొడ్లు, ర్యాంప్ నిర్మాణం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందన్నారు. ఇవిఎం ద్వారా ఓటు హక్కు వినియోగంపై ప్రత్యేక కేంద్రాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఈ నెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకుని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ఇన్‌ఛార్జ్ డిఆర్ఒ కె.శ్రీరమణి, రాజకీయ పార్టీల ప్రతినిధులు రావూరి వెంకటేశ్వరరావు (వైసిపి), పెద్దిరెడ్డి రవికిరణ్ (బిజెపి), గదులు సాయి బాబా(టిడిపి), సబ్బారపు అప్పారావు (బిఎస్‌పి), మోర్త రాజశేఖర్ (సిపిఎం), నరాల శివ (ఆప్,) కలెక్టరేట్ ఎన్నికల విభాగం డిటి ఎం.జగన్నాథం పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ



శిక్షణా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ రాజు

ప్రజాశక్తి - మండపేట

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల అభివద్ధి ప్రణా ళికపై సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, కార్యదర్శులకు రెండు రోజులపాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని మండల అభివద్ధి అధికారి ఐదం రాజు శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ శిక్షణలో గ్రామ పంచాయతీలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, పారిశుధ్య నిర్వహణ తడితర అంశాలపై ప్రణాళికతో పాటు సూచనలు సలహాలు అందిస్తారన్నారు. . ప్రత్యేక శిక్షణ పొందిన గ్రేడ్-1 పంచా యతీ కార్యదర్శులు వివిఆర్‌కె.రాజు, కె.సాయి ప్రసాద్ లు శిక్షణ ఇచ్చారు. కార్య క్రమంలో మండల పరిపాలన అధికారి విఎన్.ప్రసాద్, మండల ఇంజినీరింగ్ అధికారి నాగేశ్వరరావు, మండల విద్యాశాఖ అధికారి ఎన్.రామచంద్రరావు పాల్గొన్నారు.

నేడు నవోదయ ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశానికి నేడు ప్రవేశ పరీక్ష జరుగుతుందని ప్రిన్సిపల్ ఆర్.కమలం తెలిపారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 37 కేంద్రాల్లో జరిగే ఈ ప్రవేశ పరీక్షకు 8506 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. కాకినాడ జిల్లాలో 15, అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 15, తూర్పు గోదావరి జిల్లాలో 7 కేంద్రాల్లో ఈ ప్రవేశ పరీక్ష నిర్వహించబడుతుందన్నారు.